# రూపేషు లక్ష్మీ!...

"నువ్వేమైనా చెప్పు మనం ప్రవర్తించే విధానంలో కూడా ఆనందం వుంది. ఒక్క రూపంలోనే కాదు. కన్ను, ముక్కు తీరు బాగుండి, చక్కటి రంగుండి, అన్నీ వున్నా, తగిన విధంగా వేషధారణ లేకపోయినా శుభ్రత లేకపోయినా, ప్రవర్తన లేకపోయినా ఆ మనిషి అందం అంతా బూడిదలో పోసిన పన్నీరులా వృధా అయిపోతుంది." అంది పక్కవాటాలో ఉన్న రాజశ్రీని చూస్తూ అరవింద.

"అవును! ఎప్పుడు చూసినా చింపిరి జుట్టూ, రంగు వెలిసిపోయి పాతగా పీలికలా అయిపోయిన ఆ చీరా, ఎంత రోతగా వుంటుందో! అబ్బ... అంది అసహ్యాన్ని వెళ్లబుచ్చుతూ మొహాన్ని చిట్లించుకుంటూ నాలిక వెళ్లబెట్టి సునందిని.

"అంతేకాదు. చెబితే ఇంకా అసహ్యించుకుంటావు. ఆ లోపల లంగాలైతే మరీ ఘోరం. అంతా అతుకుల బొంతలే. చిరుగుతూన్న కొద్దీ కుట్టీ కుట్టీ అల్లుగుడ్డలా నల్లగా అయిపోయిన ఆ లంగాలు చూస్తే అసహ్యం వేస్తుంది. పాపం! శ్రీనివాసరావుగారు ఎలా కాపురం చేస్తున్నారో ఏమో ఆవిడతో!" అంది నవ్వుతూ అరవింద. "డబ్బులేని వాళ్లయితే, అయ్యో పాపం, ఏంచేస్తారూ అనుకోవచ్చు. కానీ అంత సంపాదిస్తున్నారు ఆయన. బోలెడంత ఆస్తుంది. హాయిగా ఉండొచ్చుగా! ఏం ఖర్మ! మరీ అంత పిసినారి తనమేమిటి? చింపిరి జుట్టూ, చింకి గుడ్డలూ, అలా ఉండకపోతే చక్కగా తల దువ్వుకుని, నీట్ గా డ్రెస్ చేసుకుని లక్షణంగా వుండొచ్చుకదా! అలా యాబ్రాసిలా ఉంటే మొహం చూడ బుద్ధి కూడా కాదు. ఇంటి ఇల్లాలే అలా వుంటే ఇంక ఇల్లూ, పిల్లలూ ఎంత ఛండాలంగా ఉంటారో ఆలోచించు! బాబోయ్!" అంది సునందిని భుజాలెగరేసుకుంటూ.

"మా అత్తయ్య, అంటే మామయ్య పెళ్లాం ఆవిడని చూస్తే ఎవరైనా ఆ ఇంట్లోని పని మనిషేమో అనుకుంటారు. అంత ఛండాలంగా ఉంటుంది.

పొద్దున్నే పేలు కుక్కుకుంటూ, చింపిరి జుట్టు విరబోసుకుని కూర్చుంటుంది. మొహాన బొట్టుండదూ, కాటుకుండదూ. పొద్దెక్కాక ఎప్పుడో స్నానం, ధ్యానం! ఒకపూట అక్కడుండవలసొస్తే, ఆవిడ చేత్తో ఏదైనా తీసుకుని తినాలంటే డోకొస్తుంది. పాపం మామయ్య! అతడు కళ్ళు మూసుకుని కాపురంచేస్తూ ఉండుంటాడు. ఆరుగురు పిల్లల్ని మాత్రం కన్నాడు. ఇప్పుడు ఆ పిల్లలకి సంబంధాలు కూడా రావడంలేదు. తల్లి మొహం చూస్తే అసలు ఇంక పిల్లల్ని చూడక్కర్లేదని వెళ్లిపోతారు.

ఆ బెంగతో పీక్కుపోయి పేషంటులా వున్న మామయ్యని చూసి సగం మంది వెళ్లిపోతారు. అలా ఉంది వాళ్ల పరిస్థితి" అంది అరవింద.

ఇంటికి ఇల్లాలు దీపం లాంటిది. ఆ ఇల్లాలు తను జ్యోతిలా వెలుగుతూ పిల్లలకీ, భర్తకీ వెలుగునివ్వాలి. అసలు ఆమెని చూడగానే కళకళలాడుతూ లక్ష్మీదేవిలా కనిపించాలి! భర్త కళ్లకి ఆమె అందంగా కనిపించాలి. భర్త కళ్లకి ఆమె అందంగా కనబడేలా, అతనిని ఆకర్షించేలా కనబడుతూ వుంటేనే అతడూ సంతోషంగా ఉంటాడు. ఆ ఇల్లు నందనవనంలా ఇంపుగా వుంటుంది. అందుకే 'రూపేషు లక్ష్మీ...' అని భార్య ఎలా ఉండాలీ, ఆమె విధులేమిటీ అని చెప్పే శ్లోకంలో షట్కర్మలలో రూపానికీ ప్రాధాన్యత నిచ్చారు. రూపం అంటే ఇక్కడ అందం అనే కాదు. అందంగా ఉండే విధానం తెలుసుకుని ఉండాలీ అని! అలా అని ఆడంబరంగా అలంకరించుకుని కూర్చోవడమూ కాదు! శుభ్రత కలిగి నీట్‌గా ఉండడమన్న మాట! అవునా" అడిగింది సునందిని.

"కరెక్ట్!" అంది అరవింద. అంతలో గడియారం అయిదుగంటలు కొట్టింది. "అమ్మో! వెళ్ళాలి. ఆయనొచ్చే వేళయింది" అంటూ హడావుడిపడుతూ పరుగుతీసింది, ఎదురింటి అరవింద.

ముసిముసిగా నవ్వుతూ, తన శ్రీవారు కూడా వొచ్చే వేళయిందని, స్నానానికి బయలుదేరింది జుట్టు ముడేసుకుని సునందిని! ★